## కోర్టు దాకా రావొద్దు!

మొదటిపేజీ తరువాయి...

సుప్రీంకోర్టుకు వెళ్లేవరకూ ఆగి.. ఆ తరువాత స్పందించడం ఇక నిలిపివేయాలని సీజేఐ చంద్రచూడ్ పేర్కొన్నారు. పంజాబ్ గవర్నర్ బన్వారీలాల్ పురోహిత్‌కు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు.

**తెలంగాణలోనూ..**

అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలుపకుండా గవర్నర్ జాప్యం చేస్తున్నారంటూ పంజాబ్ సర్కార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. తన వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ ఆమోదించేలా గవర్నర్‌ను ఆదేశించాలని కేంద్రానికి సూచించింది. పంజాబ్ సర్కార్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. జూన్ 26న ప్రభుత్వం నాలుగు బిల్లులు పంపిందని, వాటిని ఆమోదించకుండా గవర్నర్ తొక్కి పెట్టారని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయకుండా సీఎంకి గవర్నర్ లేఖ రాశారని చెప్పారు. ఆర్థిక అంశాలకు సంబంధించిన బిల్లులను 4 నెలలుగా తొక్కి పెట్టారని వివరించారు. ఇలాంటి పరిస్థితులే మరో రాష్ట్రంలో కూడా జరిగాయి కదా అంటూ సీజేఐ తెలంగాణలో జరిగిన ఉదంతాన్ని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ తమిళిసై తొక్కిపెట్టిన విషయం తెలిసిందే. చివరికి సుప్రీంకోర్టు జోక్యంతో అవి ఆమోదం పొందాయి. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. 'ప్రభుత్వాలు గవర్నర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు దాకా ఎందుకు రావాలి? గవర్నర్ ఆ బిల్లులను ఆమోదించాలి కదా!' అని వ్యాఖ్యానించారు.

**కోర్టుకెక్కాక ఆమోదిస్తున్నారు..**

ఇంతకుముందు తెలంగాణ ప్రభుత్వం తరఫున కూడా వాదనలు వినిపించిన సింఘ్వీ మాట్లాడుతూ.. తెలంగాణ సమస్యపై కూడా తాము సుప్రీంకోర్టుకు వచ్చిన తరువాత ఆ రాష్ట్ర గవర్నర్ బిల్లును ఆమోదించారని తెలిపారు. 'మీరు సుప్రీంకోర్టుకు వచ్చిన తరువాత గవర్నర్ చర్యలకు ఉపక్రమించడం భావ్యం కాదు.. ఇకపై ఇలా జరుగకూడదు' అని సీజేఐ అన్నారు. గవర్నర్లు, ప్రభుత్వాలు.. ఇద్దరూ కొంత ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరముంది అని అభిప్రాయపడ్డారు.

# బెంగ అందుకే!

*హైదరాబాద్ కంపెనీలను బెంగళూరుకు తరలించేందుకు కర్ణాటక కాంగ్రెస్ సర్కారు ప్రయత్నిస్తున్నదా? ఈ మేరకు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఫాక్స్‌కాన్‌కు లేఖ రాశారా? ఇందులో నిజమెంతా? ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు ఈ వార్తలకు ఊతమిచ్చాయి. ఈ క్రమంలోనే ఫాక్స్‌కాన్ లేఖపై డీకేను ఎన్డీటీవీ సహా పలు జాతీయ మీడియా సంస్థలు ప్రశ్నించాయి. 'లేఖ రాశారా?' అని అడిగాయి. అయితే, ఆ లెటర్‌ను నకిలీగా అభివర్ణించిన ఆయన.. ఏ కంపెనీకి లేఖ రాయలేదని చెప్పుకొచ్చారు. దీంతో 'బెంగళూరుకు కంపెనీలు వద్దా?' అంటూ మీడియా ఎదురు ప్రశ్నించింది. అనుకోని ప్రశ్నతో ఒకింత షాక్‌కు గురైన డీకే.. మాటమార్చుతూ రాజకీయాలపైకి విషయాన్ని మళ్లించారు. ఎందుకు??*

## ట్రాఫిక్, కరెంట్, నీళ్లు, ఇన్‌ఫ్రా సమస్యల్లో బెంగళూరు

### దశ-దిశలేని పాలసీలు, ప్రభుత్వంలో అంతులేని అవినీతి

### పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తల వెనుకడుగు

### మౌలిక వసతులలేమిని నిరసిస్తూ ప్రముఖుల మండిపాటు



బెంగళూరులో ట్రాఫిక్ కష్టాలకు నిదర్శనమే ఈ చిత్రం



కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): 'బెంగళూరుకు కంపెనీలు వద్దా?' అని మీడియా ప్రశ్నించగానే కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మాటమార్చడంపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతున్నది. బెంగళూరులో మౌలికవసతుల కొరత కారణంగానే కొత్త కంపెనీలు రావట్లేదని, ఇది తెలిసే, డీకే మాటమార్చారని పలువురు కామెంట్లు చేస్తున్నారు. గడిచిన ఐదేండ్లుగా జరుగుతున్న పరిణామాలను విశ్లేషిస్తే ఇది నిజమేననిపిస్తున్నది. నిన్నటివరకూ బహుళజాతి సంస్థలకు, కొత్త పెట్టుబడులకు బెంగళూరే గమ్యస్థానంగా ఉండేది. అయితే, నాలుగేండ్ల బీజేపీ పాలనలో, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో సిలికాన్ సిటీ సమస్యలకు అడ్డాగా మారిపోయింది. రోడ్డెక్కితే ట్రాఫిక్ కష్టాలు, విద్యుత్తు కోతలు, తాగునీటికి తంటాలు, మౌలిక వసతుల లేమి, లోపభూయిష్టమైన పాలసీలు, ప్రభుత్వంలో పేరుకుపోయిన అవినీతి వెరసి బెంగళూరులో కొత్త పరిశ్రమలను స్థాపించేందుకు ఎవ్వరూ మొగ్గుచూపట్లేదు.

**ట్రాఫిక్ కష్టాలు మామూలుగా లేవు**

బెంగళూరులో గత కొన్ని రోజులుగా ట్రాఫిక్ కష్టాలు తారాస్థాయికి చేరుకున్నాయి. 2-3 కిలోమీటర్ల ప్రయాణానికి గంటల సమయం పడుతున్నది. ఇటీవల జరిగిన మూడు ఘటనలు బెంగళూరు ట్రాఫిక్ సమస్యకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఓ మహిళ కూరగాయలను ఒలుచుకుంటూ వినూత్నంగా నిరసన తెలిపారు. బెంగళూరు ట్రాఫిక్‌లో వంట కూడా చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. కారులో ప్రయాణిస్తూ ఔటర్ రింగ్ రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న కొందరు పిజ్జాకు ఆర్డర్ ఇవ్వడం, దానిని ఆన్‌టైమ్‌లోనే డెలివరీ బాయ్ ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఉన్న కారు వద్దకే వచ్చి డెలివరీ చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఇక, బెంగళూరు ట్రాఫిక్‌లో చిక్కుకొన్న ఓ వ్యక్తికి అతనేదో షాపింగ్‌కు వెళ్లినట్టు 'మీ షాపింగ్ అనుభవం ఎలా ఉంది?' అంటూ గూగుల్ నుంచి నోటిఫికేషన్ వచ్చింది. ఆయన గంటల తరబడి ఓ షాపింగ్ మాల్ పక్కన ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడమే అందుకు కారణంగా తెలుస్తున్నది. గత బీజేపీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నట్టు మండిపడుతున్నారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యపై బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్ దాస్, ఖాతా బుక్ సంస్థ వ్యవస్థాపకుడు రవీశ్ నరేశ్, దక్షిణాఫ్రికాకు చెందిన ప్రముఖ కమెడియన్ ట్రెవోర్ నోహ్ సహా పలువురు ప్రముఖులు కూడా అసహనం వ్యక్తం చేశారు.

**అటు విద్యుత్తు కోతలు.. ఇటు నీటి వెతలు**

బెంగళూరులో గంటలతరబడి కొనసాగుతున్న విద్యుత్తు కోతలతో అటు ప్రజలతో పాటు పారిశ్రామికవర్గాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తరుచూ పవర్ కట్స్ కొనసాగుతుండటంతో కొన్ని కంపెనీలు ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేయాల్సిందిగా (వర్క్ ఫ్రమ్ హోమ్) ఆదేశిస్తున్నాయి. శివారుల్లోని చిన్న, మధ్యస్థాయి పరిశ్రమలు, కర్మాగారాలు పవర్ హాలిడేలు ప్రకటిస్తున్నాయి. కాంగ్రెస్ వచ్చాక విద్యుత్తు కష్టాలు మరింతగా పెరిగాయని పలువురు మండిపడుతున్నారు. అయితే, మరమ్మతుల పనుల కారణంగానే విద్యుత్తు కోతలు విధిస్తున్నట్టు ప్రభుత్వం కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నది. మరోవైపు, నగరంలోని స్మార్ట్‌సిటీ, ఎలక్ట్రానిక్‌సిటీ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. నీటి సరఫరాపై సర్కారుకు సరైన ప్రణాళిక లోపించడం, కావేరీ ప్రాజెక్టు-5 పనుల్లో జాప్యంతో సిటీతో పాటు శివారుల్లోని దాదాపు 110 మేజర్ ప్రాంతాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్నది. అయితే, నైపుణ్యం కలిగిన కార్మికులు దొరకకపోవడంతోనే కావేరీ నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నట్టు కాంగ్రెస్ సర్కారు వింత కారణం చెబుతుండటం విమర్శలకు తావిస్తున్నది.

**వీటితో మరింత సతమతం**

ట్రాఫిక్, విద్యుత్తు, నీటి కష్టాలే కాదు కంపెనీలను ప్రారంభించడానికి అవసరమైన మౌలికవసతులను కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నది. కంపెనీలకు అనుమతులను మంజూరు చేసే పారిశ్రామిక విధానాలు ఒక దశ-దిశలేకుండా లోపభూయిష్టంగా ఉండటం, సర్కారులో పేరుకుపోయిన తీవ్రమైన అవినీతి పెట్టుబడులకు ఆటంకంగా మారాయి. దీంతో నైపుణ్యం కలిగిన మానవ వనరులు విస్తృతంగా అందుబాటులో ఉన్నప్పటికీ బెంగళూరుకు కొత్త పరిశ్రమలు రావడంలేదు. ఇదే సమయంలో పరిశ్రమలకు అత్యంత అనుకూల వాతావరణాన్ని కలిగి ఉన్న హైదరాబాద్ వైపునకు పారిశ్రామికవేత్తలు దృష్టిసారిస్తున్నారు. దీంతో ఉన్నపళంగా మౌలిక వసతులను మెరుగుపర్చలేక, నగరాన్ని విడిచిపోతున్న పరిశ్రమలను అడ్డుకోలేక కర్ణాటక కాంగ్రెస్ సర్కారు ఆపసోపాలు పడుతున్నది. కుట్రలతో హైదరాబాద్ నుంచి కంపెనీలను రప్పించడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

### పెట్టుబడులు కష్టం

"కర్ణాటకలో ట్రాఫిక్, మౌలిక సదుపాయాల సమస్య ఉన్నది. పరిస్థితులు మారకపోతే, నగరానికి పెట్టుబడులు రావడం కష్టం. – బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా

### అందుకే తరలిపోతున్నాయి

కర్ణాటకలో సమస్యలు ఉండటంవల్లే పెట్టుబడులు హైదరాబాద్‌కు తరలిపోతున్నాయి. – ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్ దాస్

### తిప్పలు తప్పట్లే

కోట్ల రూపాయల పన్నులు చెల్లిస్తున్నా బెంగళూరులోని స్టార్టప్ కంపెనీలకు తిప్పలు తప్పడం లేదు. ఇండియన్ సిలికాన్ వ్యాలీగా ఖ్యాతిపొందిన బెంగళూరులో ఇప్పుడు ఎటు చూసినా విద్యుత్తు కోతలు, గతుకుల రోడ్లు, నడిచేందుకు ఏమాత్రం వీలుకాని ఫుట్‌పాత్‌లు, అస్తవ్యస్థమైన నీటి సరఫరా వ్యవస్థలే. – ఖాతా బుక్ సంస్థ వ్యవస్థాపకుడు రవీశ్ నరేశ్"



## చందాలతో వంతెన నిర్మాణం

- సొంతంగా నిర్మించుకొన్న కర్ణాటక అన్నదాతలు
- కృష్ణా నది దాటేందుకు 24 లక్షలతో నిర్మాణం
- ఏండ్లుగా అభ్యర్థనలు పట్టించుకోని పాలకులు
- నిర్లక్ష్యంపై విసుగెత్తిన గ్రామస్థులు, రైతులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): అది కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లా జమఖండి తాలూకా కంకన్‌వాడి గ్రామం. దాదాపు 300 మంది జనాభా ఉంటారు. రాష్ట్రంలో గత కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ ప్రభుత్వాలు మారాయి.. నాయకులు మారారు.. అయినా వారి గ్రామం పక్కన ఉండే కృష్ణా నది దాటి తమ వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు అవసరమైన వంతెన వ్యథ మాత్రం తీరలేదు. బ్రిడ్జి నిర్మించాలని ఎన్నిసార్లు అభ్యర్థనలు పెట్టుకొన్నా పాలకులు పట్టించుకొన్న పాపాన పోలేదు. దీంతో విసుగెత్తిపోయిన గ్రామస్థులు, రైతులు.. తమకు తాముగానే దాదాపు రూ.24 లక్షల మేర చందాలు వేసుకొని కర్రల వంతెన నిర్మించుకొన్నారు. మరో రెండు లక్షలు ఖర్చుపెట్టి ఆ వంతెనను ఓ మంత్రితోనే ఆవిష్కరింపజేసి.. ఇన్నేండ్లుగా పాలకులు వహించిన నిర్లక్ష్య వైఖరిని బయటి ప్రపంచానికి చాటారు.

**పొలాలకు వెళ్లాలంటే నరకయాతన**

కంకన్‌వాడి గ్రామానికి పక్కనే కృష్ణా నది ఉంటుంది. ఆ నదికి ఆవలి వైపున గుహేశ్వర్ ద్వీపంలో గ్రామస్థులకు మొత్తంగా 800 ఎకరాల మేర వ్యవసాయ భూములు ఉంటాయి. నది దాటితే గానీ వారి భూములకు వెళ్లలేని పరిస్థితి. ప్రతి ఏటా నదిని దాటుకొని తమ భూముల్లోకి వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సిందే. అంత పెద్ద బ్రిడ్జి కట్టలేమని చేతులెత్తేసిన ప్రభుత్వం గ్రామస్థులకు ఓ మెకనైజ్డ్ బోటును మాత్రం అందించింది. ప్రతి ఏడాదీ ఆ బోట్ నిర్వహణ కోసమే గ్రామస్థులు రూ.5-6 లక్షలు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. బ్రిడ్జి నిర్మించి తమకు రాకపోకల సౌకర్యం కల్పించాలని 1985 నుంచి విన్నవించుకొన్నా, అర్జీలు పెట్టుకొన్నా.. ఏ ప్రభుత్వం గానీ, అధికారి కానీ, నాయకుడు కానీ పట్టించుకోలేదు. దాంతో విసిగి వేసారిన గ్రామ ప్రజలు యూట్యూబ్ ద్వారా ఓ కర్రల వంతెన గురించి తెలుసుకొని, ఆ వీడియోను స్ఫూర్తిగా తీసుకొని లక్షల రూపాయల చందాలతో నది దాటేందుకు ఒక కర్రల వంతెన నిర్మించుకున్నారు.

**3 నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి**

30 మంది రైతులు మూడు నెలల్లో తాళ్లతో కూడిన వంతెనను నిర్మించుకోవడం చర్చనీయాంశంగా మారింది. 800 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పుతో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేశారు. కొసమెరుపేమంటే జిల్లాకు చెందిన ఎక్సైజ్ మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్‌ను ఆహ్వానించి ధూంధాంగా వంతెనను ప్రారంభించుకొన్నారు. దీంతో మంత్రి గ్రామస్థులను అభినందించక తప్పలేదు. ఈ వార్తను చదివిన నెటిజన్లు మాత్రం పాలకులు, అధికారులు సిగ్గుపడేట్టు చేశారని కామెంట్లు చేస్తున్నారు.

